అవన్ ఫ్లిక్స్‌తో సీబీఐటీ ఒప్పందం


ఒప్పంద పత్రాలతో ఇరు సంస్థల ప్రతినిధులు

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాల విద్యార్థులలో సృజనాత్మక ఆలోచనలు, రూపకల్పన, ప్రచారంలాంటి సేవలను అందించే సంస్థ అవన్ ఫ్లిక్స్‌తో సీబీఐటీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. గురువారం కళాశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా సీబీఐటీ ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు, అవన్ ఫ్లిక్స్ సీఈఓ కమల్ చోప్రా, అధ్యక్షుడు రోహిత్‌లు ఒప్పందాలపై సంతకాలు చేశారు. కార్యక్రమంలో ఐఐసీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఉమాకాంత్ చౌదరి, ప్రొగ్రెషన్ ప్రొఫెసర్ పీవీ రవీందర్‌రెడ్డి, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ శ్రీనివాస్, విద్యార్థి ప్రతినిధి లిఖిత పాల్గొన్నారు.

15నుంచి సివిల్ ఇంజినీరింగ్ ఇన్నోవేషన్


పోస్టర్ విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో ఈ నెల 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీస్, ఇన్నోవేషన్ ఫర్ ఆటోమేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజినీరింగ్ అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు తెలిపారు. కళాశాలలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సివిల్ ఇంజినీరింగ్‌లో ఆటోమేషన్ కొరకు వివిధ ఏఐ, ఎంఎల్ అప్లికేషన్‌ల గురించి ఇందులో చర్చిస్తామన్నారు. ఐఐటీలు, ఎన్ఐటీలు, వివిధ విశ్వవిద్యాలయాల అధ్యాపకులు, పరిశ్రమలకు చెందిన ప్రఖ్యాత నిపుణులు కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమాన్ని ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ కేపీఎల్ సుబ్రమణ్యం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సివిల్ ఇంజినీరింగ్ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ కె. జగన్నాథరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అక్రమ పార్కింగ్

- ఇతర వాహనదారులకు ఇబ్బందులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు
- మామూళ్లతో సరిపెట్టుకుంటున్నారని ఆరోపణలు


భారీ వాహనాలు నడిచే రోడ్డుపై పార్కింగ్

మైలార్‌దేవ్‌పల్లి : ప్రతి నిత్యం ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యాపార సముదాయాలు, పరిశ్రమల వద్ద రోడ్లపైనే పార్కింగ్ చేసినా ట్రాఫిక్ పోలీసులు చూసీ చూడనట్లుగా ఎందుకు వ్యవహరిస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. రోడ్లపై వాహనదారులు ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్ చేయడం వల్ల ఇతర వాహనాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధి కాటేదాన్ పారిశ్రామికవాడలోని ఆటో స్టాండ్ సమీపంలో ఓ పరిశ్రమ యాజమాన్యం తమ కార్మికుల కోసం ఏకంగా ప్రధాన రహదారిపై అక్రమంగా పార్కింగ్ ఏర్పాటు చేసింది. అటు నుంచి భారీ వాహనాలు కూడా వెళ్తుంటాయి. గతంలో అనేక మార్లు ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు పరిశ్రమ యాజమాన్యం ఇచ్చే మామూళ్ల వల్లనే అక్రమ పార్కింగ్‌పై చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్కడ నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు ఇప్పటికైనా వాహనదారులకు ఇబ్బంది లేకుండా ఉండేలా రోడ్డుపై ఉన్న పార్కింగ్‌ను పూర్తిగా తొలగించి, అక్కడ నో పార్కింగ్ సూచికను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



పరిశ్రమలో పని చేసే కార్మికులు ప్రధాన రోడ్డుపై అక్రమంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. పరిశ్రమ యాజమాన్యం తమ పరిధిలో పార్కింగ్ ఏర్పాటు చేసుకోవాలి. అక్రమ పార్కింగ్‌పై యాజమాన్యంపై ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలి.

\- చింటురెడ్డి, వాహనదారుడు

రోడ్డుపై పార్కింగ్ చేస్తే చర్యలు



కాటేదాన్ పారిశ్రామిక వాడలోని ఓ పరిశ్రమ యాజమాన్యం రోడ్డుపై ఏర్పాటు చేసిన పార్కింగ్ విషయం మా దృష్టికి వచ్చింది. ఎవరైనా సరే రోడ్లపై పార్కింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

\- నర్సింహాగౌడ్, రాజేంద్రనగర్ ట్రాఫిక్ అడిషనల్ సీఐ

మైలార్‌దేవ్‌పల్లిలో కార్డన్ సర్చ్


తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

మైలార్‌దేవ్‌పల్లి : మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు బుధవారం అర్ధరాత్రి నుంచి కార్డన్ సర్చ్ నిర్వహించారు. శాస్త్రీపురం, అక్బర్ కాలనీ, వట్టిపల్లి, మహమ్మదీయాకాలనీ, ఓవైసీ కాలనీలలో 50 మంది పోలీసు బలగాలతో ప్రతి ఇంటినీ జల్లెడ పట్టామని ఇన్‌స్పెక్టర్ నరేందర్ తెలిపారు. 8 మంది రౌడీ షీటర్ల ఇండ్లలో తనిఖీలు చేశామన్నారు. ఓ ఆటో నిండా నిషేధిత గుట్కా ప్యాకెట్లను గుర్తించి ఆటోను, గుట్కా ప్యాకెట్లను సీజ్ చేసి డ్రైవర్ షేక్ మహమ్మద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అర్ధరాత్రి రోడ్లపై తిరిగే వారి తాటా తీస్తామని పోలీసులు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాములు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి


మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్‌ను సన్మానిస్తున్న కార్పొరేటర్

మణికొండ: మున్సిపాలిటీల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్, కమిషనర్ టి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని నార్సింగి 6వ వార్డులో బీజేఆర్ కమ్యూనిటీహాల్, శ్మశానవాటిక నిర్మాణ పనులు, వార్డులో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఎక్కడా చెత్త ఉండకుండా చర్యలు చేపట్టాలని, చెత్త కనిపిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం చైర్‌పర్సన్, కమిషనర్‌ను కౌన్సిలర్ సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పత్తి శ్రీకాంత్‌రావు, టీపీఓ మణిచందన, డీఈఈ నరసింహారాజు, మున్సిపల్ మేనేజర్ యోగేష్, ఆర్ఐ అఖిల్‌కుమార్, వార్డు అధికారి స్వామి పాల్గొన్నారు.

బేకరీకి రూ. 9 వేల జరిమానా

బండ్లగూడ : నాణ్యతా ప్రమాణాలు పాటించని వ్యాపారులపై చర్యలు తప్పవని శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం కాళీకానగర్‌లోని బెంగళూరు అయ్యంగార్ బేకరీని పరిశీలించారు. వారు ఎలాంటి నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని, పరిశుభ్రత లేకుండా తయారు చేస్తున్న బేకరీ పదార్థాలను చూసి రూ. 9 వేల జరిమానా విధించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ శ్రీశైలం, ఫెనాల్టీ టీం శ్రీనివాస్, ముదాస్సీర్ తదితరులు పాల్గొన్నారు.


బేకరీ షాపు నిర్వాహకుడికి జరిమానా విధిస్తున్న అధికారులు

మొహర్రం ఏర్పాట్లు చేయాలని వినతి


డీసీ రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సయ్యద్ షనవాజ్

రాజేంద్రనగర్: మొహర్రం సంతాప దినాల సందర్భంగా తగు ఏర్పాట్లు చేయాలని యూత్ కాంగ్రెస్ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ షనవాజ్ కోరారు. ఈ మేరకు గురువారం రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్, జలమండలి జీఎం, ట్రాన్స్‌కో ఏఈలను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు.

డ్రైనేజీ పనులు ఆపండి


అడిషనల్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ది సిటిజన్ కౌన్సిల్ నాయకులు

మణికొండ: హుడా కాలనీలోని అంబియన్స్ కోర్ట్ గేటెడ్ కమ్యూనిటీ మురుగునీటిని పందెన్‌వాగులో కలిపే పనులు కొనసాగుతున్నాయని, వాటిని వెంటనే నిలిపివేయాలని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ది సిటిజన్ కౌన్సిల్ సంస్థ ప్రతినిధులు గురువారం మున్సిపల్ శాఖ అడ్మినిస్ట్రేషన్ అడిషనల్ డైరెక్టర్ డి. జాన్ శాంసన్‌కు వినతిపత్రం అందజేశారు. 850 గృహాల మురుగునీరు ఒకే చోట వాగులో కలవడం వల్ల చుట్టు పక్కల వారు జీవించలేని పరిస్థితి వస్తుందని కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ షేక్ ఆరీఫ్ , కార్యదర్శి ఉపేంద్రనాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌రావు అన్నారు. మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని అధికారి హామీ ఇచ్చినట్టు వారు పేర్కొన్నారు.

ప్రభుత్వ గురుకుల డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

శంషాబాద్ : శంషాబాద్ పట్టణంలోని సాతంరాయిలోని మహాత్మా జ్యోతిబాపూలే ప్రభుత్వ గురుకుల బాలుర డిగ్రీ కళాశాలలో (కందుకూరు) స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జంగం విరూపాక్షప్పా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ (ఎంఎస్ఏఐ, ఏఎల్), బీఎస్సీ (బీజెడ్సీ), బీకాం (సీఏ), బీఏ (ఐఆర్ఈపీ), బీబీఏ ఇంగ్లిష్ మీడియంలో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. స్పాట్ అడ్మిషన్ల కోసం విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో అడ్మిషన్ పొందవచ్చన్నారు. మరిన్ని వివరాల కోసం 9502842482, 9491694218,8341905950 నంబర్లను సంప్రదించాలన్నారు.

అక్రమ నిర్మాణాలపై డీపీఓకు ఫిర్యాదు

శంషాబాద్ రూరల్ : మండలంలోని చౌదరిగూడ రెవెన్యూలో సర్వే నంబరు 183లో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని గురువారం డీపీఓకు ఫిర్యాదు చేశారు. సమీపంలో ఉన్న బొల్లవాని చెరువులోకి వరదనీరు వెళ్లకుండా నిర్మాణాలు జరుగుతున్నాయని వివరించారు. స్థానిక పంచాయతీ సిబ్బంది అండదండలతో నిర్మాణాలు చేస్తున్నారని ఆరోపించారు. నిర్మాణాలను నిలిపివేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తుడు శ్రీనివాస్ ఫిర్యాదులో కోరారు.

చెత్తను వేరు చేసి సేకరించాలి


చెత్త సేకరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: తడి, పొడి చెత్తను వేరు చేసి సేకరించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. గురువారం ఉదయం 5, 13, 16 డివిజన్‌లలో ఇంటింటి చెత్త సేకరణను పరిశీలించి స్వచ్ఛ ఆటో డ్రైవర్లకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటి చెత్త ఆటో రిక్షా కార్మికుడికి అందించాలన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు రామాంజనేయులు, సుభాష్, కృష్ణ, వెంకటేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

రాజేంద్రనగర్: ప్రజాపాలన కౌంటర్‌లో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాజేంద్రనగర్ అధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి కోరారు. రాజేంద్రనగర్ మహిళా భవనంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 200 యూనిట్ల లోపు ప్రభుత్వం ఉచిత కరెంటు అందిస్తుందన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని, కేంద్రానికి నేరుగా వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.


కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఝాన్సీరెడ్డి

దశలవారీగా సమస్యల పరిష్కారం

కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్



అత్తాపూర్ : దశల వారీగా సమస్యలను పరిష్కరిస్తామని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ సంగీత గౌరీశంకర్ అన్నారు. గురువారం అత్తాపూర్ డివిజన్‌లో బస్తీ వాసులతో కలిసి సీసీ రోడ్డు పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అత్తాపూర్ వాసుదేవారెడ్డి నగర్ కాలనీలో దాదాపు రూ. 21 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులు చేపట్టామన్నారు. నాణ్యత లోపించకుండా అధికారులు పనులను పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

క్యాబ్ డ్రైవర్ అనుమానాస్పద మృతి


మృతుడు శ్రీనివాస్(ఫైల్)

మణికొండ : రోడ్డు పక్కన స్థలంలో పార్క్ చేసి క్యాబ్‌లో నిద్రించిన డ్రైవర్ అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ ఘటన నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని హైదర్‌షాకోట్‌లో గురువారం వెలుగు చూసింది. నార్సింగి ఇన్‌స్పెక్టర్ జి. హరికృష్ణారెడ్డి వివరాల ప్రకారం ... కరీంనగర్ జిల్లాకు చెందిన గాండ్ల శ్రీనివాస్(40) తన భార్య, కూతురు, కుమారుడితో కలిసి హైదర్‌షాగోట్‌లోని శాంతి నగర్‌లో నివసిస్తున్నాడు. అతను క్యాబ్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. మద్యానికి బానిసై అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం అతను తన క్యాబ్ (టీఎస్10యూఏ8026)ను హైదర్‌షాకోట్‌లో ప్రధాన రోడ్డు పక్కన పార్కింగ్ స్థలంలో నిలిపి అందులోనే నిద్రించాడు. నిద్రలోనే అతను మృతి చెందాడు. అతిగా మద్యం తాగడం, కారు అద్దాలు అన్నీ మూసి ఉండటంతో ఆక్సిజన్ అందక మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. అతడి శరీరంపై ఎలాంటి గాయాలు లేవని సీఐ పేర్కొన్నారు. భార్య వేధింపులతో ఇంటికి దూరమై మానసిక వేదనతో మృతి చెందాడని మృతుడి తల్లిదండ్రులు ఆరోపించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ హరికృష్ణారెడ్డి తెలిపారు.

ఉద్యోగులను జాగ్రత్తగా చూసుకుంటే.. వారు కంపెనీని జాగ్రత్తగా చూసుకుంటారు


టీహబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీఈఓ సుపర్ణమిత్ర, ప్రియాగజ్దర్

రాయదుర్గం: మీరు ఉద్యోగులను జాగ్రత్తగా చూసుకుంటే వారు వ్యాపారం, కంపెనీని బాగా చూస్తారని టైటాన్ వాచెస్ అండ్ వేరబుల్ డివైసెస్ సీఈఓ సుపర్ణమిత్ర అన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్(ఎఫ్ఎల్ఓ) హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో 'టాటా లెగసీ-లివింగ్ వాల్యూస్' అనే అంశంపై గురువారం సమావేశం జరిగింది. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ చాప్టర్ చైర్‌పర్సన్ ప్రియాగజ్దర్‌తో ఆమె ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుపర్ణమిత్ర పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. వ్యక్తిగతంగా కంటే మహిళలు కలిసి, సామూహికంగా జట్టుగా ఉంటే అందంగా, బలంగా ఉంటారన్నారు, చేతి గడియారాలు ఎప్పటికీ చెలామణిలో నుంచి పోవని స్పష్టం చేశారు. ప్రస్తుత మొబైల్ ఫోన్ల యుగంలోనూ చేతి గడియారాలు పాతబడిపోలేదన్నారు.ప్రియాగజ్దర్ మాట్లాడుతూ వ్యక్తుల కేంద్రీకృత విలువలు, మానవీయ దృక్పథం దాని జీవనాధారమని చెప్పారు.

కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు


మాజీ సీఎం కేసీఆర్‌తో నాయకులు, కార్యకర్తలు

మణికొండ: మాజీ సీఎం కేసీఆర్‌ను గురువారం నార్సింగి మున్సిపాలిటీ వట్టినాగులపల్లి నాయకులు కలిశారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఉన్న సమస్యలు, గ్రామాల అభివృద్ధి, ఎమ్మెల్యే పనితీరు తదితర విషయాలను కేసీఆర్ అడిగి తెలుసుకున్నారని నాయకులు తెలిపారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో మున్సిపల్ నాయకులు విష్ణువర్ధన్, వెంకటేష్, లక్ష్మణ్, సాయి, పొన్నయ్య, మహేందర్, పాండు, శ్రీనివాస్, ప్రేమ్‌కుమార్, నరేష్‌కుమార్, శేఖర్, సుభాష్, రాజు తదితరులు ఉన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

మణికొండ: మిత్రులకు అప్పులు ఇప్పించి వారి వత్తిడి తట్టుకోలేక ఓ ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పీరంచెరువు భవానీ కాలనీలో బుధవారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం... వరంగల్ జిల్లాకు చెందిన సందీప్(21) మొయినాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ 3వ సంవత్సరం చదువుతున్నారు. అతని తండ్రి మోహన్ అదే కళాశాలలో బస్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మృతుడు తన స్నేహితులకు వడ్డీలకు మధ్యవర్తిగా ఉండి డబ్బులు ఇప్పించాడు. డబ్బులు తీసుకున్న వారు సకాలంలో చెల్లించకపోవటంతో అతడిపై డబ్బు ఇచ్చిన వారు ఒత్తిడి పెంచారు. దీంతో బుధవారం రాత్రి ఇంట్లో అతడి గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. గురువారం ఉదయం చూసిన తల్లితండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

అత్తాపూర్ : గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైన ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. ఏఎస్ఐ ప్రభాకర్ వివరాల ప్రకారం.. పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ ఎలివేటెడ్ వే-138 పిల్లర్ సమీపంలో గుర్తు తెలియని మృతదేహం ఉంది. విషయం తెలుసుకున్న అత్తాపూర్ పోలీసులు అక్కడికి వెళ్లి మృతదేహాన్ని ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించారు. జనరల్ ఆసుపత్రి మార్చురీలో మృతదేహాన్ని భద్రపరిచారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హెచ్‌సీయూ పరిశోధక విద్యార్థికి పీహెచ్‌డీ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థి కామెర పురుషోత్తంకు పీహెచ్‌డీని ప్రకటించారు. మంచిర్యాల జిల్లా ములకలపేట గ్రామానికి చెందిన కామెర పురుషోత్తం 'తెలంగాణలో భావ కవిత్వం వస్తు శిల్పం' అనే అంశంపై తెలుగు విభాగంలో పీహెచ్‌డీ థీసిస్‌ను సమర్పించారు. తెలుగు విభాగం ఆచార్యుడు డాక్టర్ భూక్యా తిరుపతి పర్యవేక్షణలో పురుషోత్తం పీహెచ్‌డీ పూర్తి చేశారు. శుక్రవారం హెచ్‌సీయూలోని తెలుగు విభాగంలో తెలుగు ఆచార్యులు దార్ల వెంకటేశ్వరరావు, పిల్లలమర్రి రాములు, గోనానాయక్, పమ్మి పవన్‌కుమార్ ఇతర ఆచార్యులు అభినందించారు.

అభిప్రాయాలను ప్రభుత్వానికి అందజేస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి

శంషాబాద్ రూరల్ : రైతు భరోసాపై రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామని జిల్లా వ్యసాయాధికారి గీతారెడ్డి అన్నారు. మండలంలోని పాల్మాకుల రైతు సేవా సహకార సంఘం ఆవరణలో సొసైటీ చైర్మన్ కె.శ్రవణ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం రైతులతో సమావేశం నిర్వహించారు. 'రైతు భరోసా' పథకం అమలుపై సూచనలు, సలహాలు స్వీకరించారు. 10 ఎకరాల సాగు భూమికి రైతుబంధు ఇవ్వాలని అత్యధిక మంది రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు పి.చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, కళావతి, మణెమ్మ, ప్రమోద్‌కుమార్, నర్సింహ, రాఘవేందర్, బాలయ్య, గౌతంకుమార్, శంకరయ్య, వెంకటయ్య, ఈశ్వర్, ఏఓ కవిత తదితరులు పాల్గొన్నారు.

పంటల వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలి

ఆన్‌లైన్‌లో పంటల నమోదును పకడ్బందీగా చేయాలని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి అన్నారు. మండలంలోని కవేలిగూడలో పంటల వివరాలను సీబీఈ ఆప్ ద్వారా రైతు పొలాల వద్దకు వెళ్లి నమోదు చేశారు. రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వ్యవసాయాధికారుల సలహాలు, సూచలను తీసుకుని రైతులు పంటల సాగు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఓ కవిత, క్లస్టర్ ఇన్‌చార్జి సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం



ప్రభుత్వ పాఠశాలను బంద్ చేయిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రాజేంద్రనగర్ : నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన విద్యా సంస్థల బంద్ రాజేంద్రనగర్ మండల కేంద్రంలో విజయవంతమైందని విద్యార్థి సంఘాల నాయకులు కె.వై.ప్రణయ్, వర్ధన్ అన్నారు. పరీక్షల నిర్వహణలో కేంద్ర విద్యాశాఖ మంత్రి పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఎన్‌టీఏ పనితీరు, నీట్ నెట్ పరీక్షల అక్రమాలు, పేపర్ లీకేజీని వ్యతిరేకిస్తూ విద్యా సంస్థలు బంద్ నిర్వహించారు. కార్యక్రమంలో మణికంఠ, అభిలాష్, జగదీష్, అజయ్, సంధ్య, సోహేశ్, తరుణ్, అర్జున్, సాయి, తేజ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

శంషాబాద్ : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. ప్రభుత్వ విద్యా సంస్థలను ఎస్ఎఫ్ఐ నాయకులు బంద్ చేయించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకుడు ప్రణయ్ డిమాండ్ చేశారు.

వైకుంఠ స్వర్గధామాలు

- మణికొండ, పుప్పాలగూడలలో పార్కులను తలపించేలా ఏర్పాట్లు
- ఆకట్టుకునేలా పచ్చదనం


పుప్పాలగూడ శ్మశానవాటిక ప్రవేశంలో ఏర్పాటు చేసిన మహాశివుడి ప్రతిమ


పార్కును తలపిస్తున్న మణికొండ వైకుంఠధామం


పుప్పాలగూడలో స్నానాల గదులు, గ్యాలరీలు

మణికొండ: చావు కూడా పెళ్లి లాంటిదే బ్రదర్ అంటూ ఓ సినిమాలో పాట ఉంది. తమ నుంచి దూరమైన కుటుంబ సభ్యుడికి ఏదీ తక్కువ కాకుండా అంత్యక్రియలను నిర్వహించాలని ఎవరైనా కోరుకుంటారు. అంతిమ యాత్ర, అంత్యక్రియలను అన్ని రకాల సౌకర్యాలతో నిర్వహించుకునేలా మణికొండ మున్సిపాలిటీ పాలక కమిటీ సభ్యులు మణికొండ, పుప్పాలగూడ గ్రామాల్లో పార్కులను తలదన్నేలా వైకుంఠధామాలను తీర్చిదిద్దారు. ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని రకాల సౌకర్యాలను కల్పించారు. అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వచ్చిన వారు కూర్చునేందుకు గ్యాలరీలు, చెట్ల నీడ ఉండేలా తీర్చిదిద్దారు. మణికొండ మున్సిపాలిటీ కేంద్రం, ల్యాంకోహిల్స్ పక్కన ఉన్న వైకుంఠధామాన్ని అభివృద్ధి చేసేందుకు మున్సిపాలిటీ నుంచి రూ.1.55 కోట్లు ఖర్చు చేశారు. ఇదే మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ వైకుంఠధామం అభివృద్ధికి 1.65 కోట్లను ఖర్చు చేశారు. గతంలో మున్సిపాలిటీ కమిషనర్‌గా పని చేసిన ఫల్గుణ్‌కుమార్ వాటిల్లో శివుని విగ్రహాలు ఏర్పాటు చేయించారు. తక్కువ ఖర్చుతోనే అంత్యక్రియలు పూర్తి అయ్యేలా మున్సిపాలిటీ తరపున వ్యక్తులను కూడా నియమించారు. అంతిమయాత్ర వాహనాన్ని మున్సిపాలిటీ నుంచే ఉచితంగా ఏర్పాటు చేశారు.

ఎక్కడా లేని విధంగా అభివృద్ధి

గండిపేట మండల పరిధిలోని ఏ గ్రామంలో కూడా లేని విధంగా మణికొండ, పుప్పాలగూడలో శ్మశాన వాటికలను తీర్చిదిద్దాం. నిధుల ఖర్చుకు వెనుకడుగు వేయకుండా ప్రజలకు సౌకర్యాలను కల్పించాము. ఆహ్లాదకరంగా ఉండేలా అందరి సహకారంతో తీర్చిదిద్దాము. మణికొండ దళిత శ్మశాన వాటికను రాబోయే రోజుల్లో అభివృద్ధి చేస్తాం.

\- కె. నరేందర్‌ముదిరాజ్, మున్సిపాలిటీ చైర్మన్